సాక్షి గుంటూరు
గురువారం । 10 । జూలై । 2025



సాయినాథుని గ్రామోత్సవం

ముప్పాళ్ళ: గురుపౌర్ణమి సందర్భంగా చాగంటివారిపాలెంలోని ప్రసన్న షిరిడీసాయిబాబా ఆలయంలో బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు.



అలరించిన భక్తి సంకీర్తన

నగరంపాలెం: స్థానిక ఆదిత్యనగర్‌లోని సాయిబాబా మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి సంకీర్తన అలరించింది.

శాకంబరిగా పార్వతీ అమ్మవారు



దుగ్గిరాల: దుగ్గిరాల గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు బుధవారం శాకంబరిగా దర్శనం ఇచ్చారు.

న్యూస్‌రీల్

రేపు వెలగపూడిలో ప్రపంచ జనాభా దినోత్సవం

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



తాడికొండ: ఈనెల 11న తుళ్లూరు మండలం వెలగపూడి సచివాలయం సమీపంలో ప్రపంచ జనాభా దినోత్సవం జరగనుంది. కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించి సభా స్థలి ఏర్పాట్లు, బార్ కోడింగ్, వాహనాల పార్కింగ్, సీటింగ్, తాగునీరు, పారిశుద్ధ్య పనులు తదితర నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. పలు సూచనలు జారీ చేశారు. గుంటూరు ఆర్డీఓ శ్రీనివాసరావు, సీపీఓ శేషశ్రీ, డీపీఓ నాగసాయి కుమార్, పీడీ డ్వామా శంకర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎంపీడీఓ శిల్ప, తుళ్లూరు తహసీల్దార్ సుజాత,అధికారులు పాల్గొన్నారు.

శాకంబరి ఉత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక అమరావతిరోడ్డు హిందూ ఫార్మసీ కళాశాల ఎదురు వీధిలోని శాకంబరి పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం శాకంబరి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కాయగూరలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి ఆలయ ప్రధానార్చకులు శ్రీకాంతశర్మ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విచ్చేసి, అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈనెల 11 వరకు అమ్మవారికి శాకంబరి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన సీఈ



విజయపురి సౌత్: నాగార్జునసాగర్ కుడి కాలువ జలవిద్యుత్ కేంద్రాన్ని శ్రీశైలం ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ చీఫ్ ఇంజినీర్ జి.తిరుమల ప్రసాద్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. శ్రీశైలం క్రస్ట్ గేట్లు ఎత్తి నాగార్జునసాగర్‌కు నీటి విడుదల జరుగుతుండటంతో కుడి జలవిద్యుత్ కేంద్రంలో పవర్ జనరేషన్‌కు సిద్ధంగా ఉండాలని సూచించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెన్‌కో క్వార్టర్స్‌ను పరిశీలించారు. సీఈ తిరుమల ప్రసాద్‌ను జెన్‌కో అధికారులు ఘనంగా సత్కరించారు. కుడి జలవిద్యుత్ కేంద్రం ఈఈ సీహెచ్ అప్పాజీ, సివిల్ ఎస్ఈ కె.వెంకటరమణ, సివిల్ ఈఈ సుబ్రహ్మణ్యం, 327 యూనియన్ సెక్రటరీ బి.సూరజ్‌చంద్, అధ్యక్షుడు ఎం.సాంబశివ, ఎస్.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అమరేశ్వరుని ఆదాయం రూ.27.09లక్షలు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న శ్రీబాలచాముండికా సమేత శ్రీ అమరేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నాలుగు నెలలుగా హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. కోటప్పకొండ దేవస్థానం సహాయ కమిషనర్ చంద్రశేఖరరావు పర్యవేక్షణలో దేవాలయంలోని 10 హుండీలను తెరచి అందులో ఉన్న నగదును లెక్కించారు. ఈఓ రేఖ మాట్లాడుతూ హుండీల ద్వారా రూ.26,32,499లు, అన్నదానం హుండీల ద్వారా రూ.75,596లు, మొత్తం రూ.27,09,095లు ఆదాయం వచ్చిందన్నారు. దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రేషన్

టీడీపీ నేతల కనుసన్నల్లో రేషన్ మాఫియా

- తూతూమంత్రంగా పోలీసు కేసులు
- భారీగా తరలి వెళ్తున్న రేషన్ బియ్యం
- ఇంటికి వచ్చి డబ్బులిచ్చి మరీ వేలిముద్రలు తీసుకుంటున్న డీలర్లు
- వాటాలలో గొడవలతో గత వారం రోజులుగా భారీగా పట్టుబడుతున్న బియ్యం



వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో పట్టుబడిన రేషన్ బియ్యం నిల్వలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ నాయకుల కనుసన్నల్లో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. డీలర్లే అక్రమంగా బియ్యాన్ని దొడ్డిదారిన తరలిస్తున్నారు. రేషన్ డిపోలో బియ్యం ఇవ్వకుండా డీలరే ఇళ్ల వద్దకు వెళ్లి వారికి కిలోకు రూ.10 చొప్పున లెక్కగట్టి డబ్బులు చేతిలో పెట్టి వేలిముద్రలు వేయించుకుంటున్నారు. గతంలో ఎండీఎంయూ వాహనాలు ఉన్న సమయంలో ఇంటి ముందుకే వచ్చి రేషన్ ఇచ్చేవారు. ఆ సమయంలో ఎక్కువమంది బియ్యం తీసుకునేవారు. అయితే ఆ వ్యవస్థను రద్దు చేయడంతో వివిధ సాకులు చూపుతూ డీలర్లు కొత్త సాంప్రదాయానికి తెరతీశారు. బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇవ్వడం ద్వారా డిపోల నుంచే రేషన్ బియ్యాన్ని మిల్లులకు తరలించేస్తున్నారు. అక్కడి నుంచి అర్ధరాత్రిళ్లు రేషన్ బియ్యం అక్రమంగా కాకినాడ, కృష్ణపట్నం పోర్టులకు తరలిపోతోంది.

కూటమి నేతల కనుసన్నల్లోనే..

గత వారం రోజులుగా జిల్లాలో పలు ప్రాంతాల్లో రేషన్ బియ్యం పట్టుబడుతోంది. రేషన్ మాఫియాలో వచ్చిన విబేధాల కారణంగా ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుంటుండటంతో రేషన్ బియ్యం దొరుకుతోంది. గుంటూరు నగరంలో ఆర్టీసీ కాలనీకి చెందిన మిల్లర్ ఈ దందాలో చురుగ్గా ఉన్నాడు. ఇతనికి అధికార పార్టీ నేతలతో సంబంధాలు ఉండటంతో అతనిపై కేసులు నమోదు కావడం లేదు.

- పాత గుంటూరు బుచ్చయ్య తోట రెండవ లైన్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ఆటోను ఆదివారం పాత గుంటూరు పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. ఆటోలో 60 బస్తాలు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.
- మూడు రోజుల క్రితం గుంటూరు సంజీవయ్య నగర్ నుంచి అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు.
- నాలుగురోజుల క్రితం దుగ్గిరాల నుంచి గుంటూరుకు తరలిస్తున్న మినీ లారీని స్వాధీనం చేసుకుని 85 రేషన్ బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. నల్లచెరువుకి చెందిన వారు ఈ రేషన్ మాఫియాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.
- మంగళగిరి నియోజకవర్గంలో ఆత్మకూరులో ఉన్న రైస్ మిల్లుకు ఇప్పటం జనసేన పార్టీకి చెందిన నేత ఒకరు రేషన్ బియ్యం కొనుగోలు చేసి సరఫరా చేస్తునట్లు ఆరోపణలు ఉన్నాయి.
- దుగ్గిరాల మండలంలో అధికార పార్టీకి చెందిన ఒక ఎంపీటీసీ, దుగ్గిరాలకు చెందిన మరో వ్యక్తి ఆధ్వర్యంలో రేషన్ మాఫియా నడుస్తుంది.

రేషన్ మాఫియా కేరాఫ్ చుండూరు

పొన్నూరు నియోజకవర్గంలోని చేబ్రోలు, పొన్నూరు మండలాల నుంచి చుండూరులోని ఓ రైస్ మిల్లుకు రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఇటీవల వట్టిచెరుకూరు మండలం నుంచి చుండూరుకు తరలిస్తున్న రేషన్ బియ్యం ఆటోను నారాకోడూరు వద్ద అధికారులు పట్టుకున్నారు.

కొల్లూరు మండలం నుంచి వట్టిచెరుకూరుకు తరలిస్తున్న రేషన్ బియ్యం ఆటోలను నారాకోడూరు వద్ద అధికారులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పొన్నూరు పట్టణం, మండలం నుంచి గుట్టు చప్పుడు కాకుండా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది. పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులో ఓ ఇంటిలో నిలువజేసిన సుమారు 40 బస్తాల రేషన్ బియ్యం పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. మాచవరం గ్రామంలో ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుంటూరు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు.



పాత గుంటూరులో పట్టుబడిన బియ్యం లారీ

మనోళ్లే.. వదిలేయ్!



తాజాగా ఆదివారం ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులోని ఒక మిల్లులో 800 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. గత ఏడాది కూడా ఇదే మిల్లుపై స్వయంగా పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ దాడిచేసి పెద్దఎత్తున బియ్యం పట్టుకున్నారు. అయినా ఆ మిల్లులో రేషన్ దందా కొనసాగుతూనే ఉంది. సుమారు ఇరవై రోజుల కిందట ప్రత్తిపాడులో సుమారు వందకు పైగా రేషన్ బస్తాల లోడుతో వెళుతున్న ఒక పెద్ద ఆటోను స్థానికులు ఆపి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వచ్చిన పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలించే లోపే స్థానిక ఎమ్మెల్యేకు దగ్గరగా ఉండే ఒక నాయకుడు పోలీసులకు ఫోన్ చెయ్యడంతో వాహనాన్ని పోలీసులు స్టేషన్‌కు తరలించకుండానే వదిలేశారు. తర్వాత విషయం సోషల్ మీడియాలో రావడంతో అర్ధరాత్రి దాటిన తరువాత వాహనాన్ని స్టేషన్ వద్దకు రప్పించారు. అయితే అప్పటికే వాహనంలో ఉన్న బియ్యం బస్తాలు ముప్పావు వంతు మాయమయ్యాయి.

వారధిపై అలుముకున్న అంధకారం

- నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు
- విద్యుద్దీపాలు వెలగకపోవటంతో తప్పని తిప్పలు

రేపల్లె: పెనుమూడి – పులిగడ్డ వారధి అంధకారంలో మగ్గిపోతోంది. ఉమ్మడి కృష్ణ – గుంటూరు జిల్లాలను కలుపుతూ కృష్ణానదిపై అనుసంధానంగా ఉన్న ఈ వారధి రాష్ట్రంలో రెండో అతి పెద్దదిగా చెప్పుకోవచ్చు. ఇక్కడ వీధి దీపాలు మరమ్మతులకు గురవ్వటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ వంతెనపై రాత్రివేళ ప్రయాణం చేయడం కత్తిమీద సాములా మారింది. రోజూ వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, బస్సులు ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. పులిగడ్డ – పెనుమూడి మధ్య ప్రయాణించాల్సిన వారికిదే ప్రధాన మార్గం.

గతంలో పలు ప్రమాదాలు

ఇటీవల రేపల్లె మండలం ఆరవపల్లికి చెందిన కుటుంబం మచిలీపట్నం బీచ్‌కి వెళ్లి వస్తుండగా రాత్రి సమయంలో వారధిపై జరిగిన ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా తెనాలికి చెందిన కుటుంబం మోపిదేవి గుడికి కారులో వెళ్తూ వారధిపై జరిగిన ప్రమాదంలో ముగ్గురు చనిపోయారు. రుద్రవరానికి చెందిన యువకుడు, పేటేరుకు చెందిన యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదం గురై మృత్యువాత పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో పాత దీపస్తంభాలు ఉన్నా కరెంట్ సరఫరా లేదు. ఈ వంతెనపై విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయడమేకాకుండా, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



గుర్తింపు ఏదీ..?

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందేనా!

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 40 రోజులు కావస్తున్నా అరకొర కార్డులే..
- బ్యాంక్ రుణాల కోసం కౌలు రైతుల ఎదురు చూపులు
- జిల్లా లక్ష్యం 46,400 సీసీఆర్‌సీ కార్డులు
- ఇప్పటివరకు మంజూరు చేసింది 9,424 మందికి మాత్రమే



కొరిటిపాడు(గుంటూరు): అన్నదాతలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 40 రోజులు కావస్తున్నా కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో తీవ్ర అలసత్వం చూపిస్తోంది. ఫలితంగా కార్డులు అందక.. బ్యాంక్ రుణాలు దక్కక కౌలు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2025–26 సీజన్‌కు గానూ జిల్లాలో 46,400 కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ లక్ష్యం కాగా ఇప్పటివరకు కేవలం 9,424 మందికి మాత్రమే సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేశారు. నిజానికి గుంటూరు జిల్లావ్యాప్తంగా అధికారికంగా సుమారు 50 వేల మందికి పైగా కౌలు రైతులు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. కానీ వాస్తవంగా జిల్లాలో 60 వేల మందికి పైగానే కౌలు రైతులు ఉన్నారు. కార్డుల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు గ్రామ సభలు నిర్వహించలేదు.



గ్రామ సభలు ఏవీ?

సాధారణంగా పంటల సీజన్ మొదలవ్వగానే కౌలు రైతుల గుర్తింపు కార్డుల పంపిణీకి సంబంధించి రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాటు చేసి కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేస్తారు. కానీ అలాంటి ప్రక్రియ జరగడం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పంటల సాగుకు బయట వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంటోందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో 46,400 కౌలు కార్డులు మంజూరు లక్ష్యంగా ఉండగా ఇప్పటికి 9,424 కార్డులు మాత్రమే మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు.

కౌలు రైతులకు అండగా వైఎస్ జగన్ సర్కార్..

కౌలు రైతులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. భూ యజమానుల హక్కులకు భంగం కలుగకుండా కేవలం 11 నెలల కాలానికి సాగు ఒప్పందం చేస్తూ 2011 కౌలు చట్టాన్ని సవరించింది, ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి ఒక సారి జారీ చేసిన కార్డును మళ్లీ భూ యజమాని అంగీకారం మేరకు రెన్యూవల్ చేసుకునే వీలు కల్పించారు. భూ యజమానుల్లో అపోహలు తొలగించడంతో జిల్లాలో సీసీఆర్‌సీ కార్డుదారులు జారీ గణనీయంగా పెరిగాయి. అసలు రైతుల మాదిగా కౌలు రైతులకు పంట రుణాలు అందించడంతో పాటు వైఎస్సార్ రైతు భరోసా, పంటల బీమా పరిహారం అందించి అండగా నిలిచింది.

సకాలంలో మంజూరు చేయాలి



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 40 రోజులు కావస్తున్నా ఇంతవరకు 9,424 కార్డులు మాత్రమే పంపిణీ చేయడం బాధాకరం. ఈ కార్యక్రమం ముమ్మరం కావాలంటే వ్యవసాయ, రెవెన్యూ శాఖలు గ్రామ సభలను ఏర్పాటు చేసి రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ ముమ్మరం చేయాలి. కౌలు కార్డులను సకాలంలో ఇవ్వకపోతే అన్నదాత సుఖీభవ, పంట రుణాలు, పంటల బీమా, సబ్సిడీ విత్తనాలు వంటివి అందే పరిస్థితి ఉండదు.

– కంచుమాటి అజయ్‌కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

కార్డుల పంపిణీ మొదలైంది



కౌలు రైతుల కార్డుల పంపిణీ జిల్లాలో ప్రారంభమైంది. ఈ విషయమై వీఆర్‌ఓలు, వ్యవసాయ అధికారులు పర్యవేక్షిస్తున్నాం. ఈ ఏడాది 46,400 మంది కౌలు రైతులకు కార్డుల లక్ష్యం కాగా ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 9,424 మంది కౌలు రైతులకు కార్డులను పంపిణీ చేశాం. మిగిలిన కార్డులను కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు కృషి చేస్తాం.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

నేటి నుంచి గౌరీ విశ్వేశ్వరాలయ శతాబ్ది ఉత్సవాలు

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని గౌరీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం శతాబ్ది మహోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. గుంటూరు నగర పరిధిలో పురాతనమైన వంద ఏళ్లకు పైబడిన శివాలయాలు ఆరుకు పైగా వెలిశాయి. అందులో శ్రీగౌరీవిశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం ఒకటి. 1925 జూన్ 12న ప్రతిష్ఠించినట్లు ప్రధాన అర్చకుడు జంధ్యాల సుబ్రమణ్యశాస్త్రి బుధవారం తెలిపారు. ఈనెల పదిన ఆషాఢ శుద్ధ పూర్ణిమ నుంచి 14వ తేదీ వరకు పాంచాహ్నికంగా నిర్వహిస్తారు. ఈనెల పదిన లక్ష బిల్వార్చన, 11న గౌరీదేవికి లక్ష కుంకుమార్చన నీరాజన మంత్ర పుష్ప, 12న ఆంజనేయస్వామికి లక్ష నాగవల్లీ దళార్చన నీరాజన మంత్ర పుష్పాలు, 13న లక్ష్మీనారాయణ స్వామికి లక్ష తులసీ దళార్చన, 14న స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



శరణు శాకంబరి



శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శాకంబరి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో రెండో రోజైన బుధవారం పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని శాకంబరిగా దర్శించుకున్నారు. మరో వైపున ఆషాఢ మాసోత్సవాలు కొనసాగుతుండగా.. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి పలు భక్త బృందాలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించాయి. సుమారు 50కిపైగా భక్త బృందాలు అమ్మవారికి సారెను సమర్పించాయి. శాకంబరీ ఉత్సవాలకు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని రైతుల నుంచి సుమారు 25 టన్నులకు పైగా కూరగాయలు, ఆకుకూరలను సేకరించినట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

సార్వత్రిక సమ్మె విజయవంతం

గుంటూరులో వామపక్షాల భారీ ర్యాలీ



వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి ర్యాలీ నిర్వహించిన వామ పక్ష పార్టీల నాయకులు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం గుంటూరులో చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. బ్యాంకింగ్, ఎల్ఐసీ, పోస్టాఫీసు సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామీణ బ్యాంకుల్లో సైతం అధికారులు సమ్మెకు పిలుపు ఇవ్వటంతో పూర్తిగా మూతపడ్డాయి. జాతీయ బ్యాంకుల్లో ఉద్యోగ సంఘాలు సమ్మెలో పాల్గొనటంతో లావాదేవీలు స్తంభించాయి. ఎస్బీఐలోనూ ఉద్యోగులు పూర్తి స్థాయిలో సమ్మెలో పాల్గొన్నారు. అదే విధంగా కార్మికులు పూర్తి స్థాయిలో సమ్మెలో పాల్గొనటంతో మిర్చియార్డు, కోల్డ్ స్టోరేజీలు, మిర్చి గోడౌన్లలో కార్యకలాపాలు పూర్తిస్థాయిలో స్తంభించాయి. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్‌లు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మెలో భాగంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి బీఆర్ స్టేడియం వరకూ వందలాది మంది కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ వర్కర్లు, ఆటో కార్మికులు, ఎన్జీరంగా యూనివర్సిటీ కార్మికులు, బ్యాంకు ఉద్యోగులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా ప్రభుత్వాలు

ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కనీస వేతన చట్టం, బోనస్ చట్టం, పనిగంటల వంటి దాదాపు 29 చట్టాలను రద్దు చేసి, యాజమాన్యాలకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లుగా మార్చారని విమర్శించారు. రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ అనుకూల విధానాలు అనుసరిస్తూ, కార్మికులను రోడ్డున పడేశాయన్నారు. సీఐటీయూ నగర కార్యదర్శి కె.శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎ.అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించగా ఎఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు యు.నాగేశ్వరరావు, రైతుకూలీ సంఘం నాయకులు విష్ణు, ఏరువాక రైతు సంఘం పి.కోటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు బి.ముత్యాలరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, ఏపీ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పి.సాయికుమార్, ఏపీ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.సువర్ణబాబు సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, సీపీఎం నేత నళినీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి పోలీస్ నోటీసులు



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): ఈ నెల 11వ తేదీన సత్తెనపల్లి పట్టణ పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరుకావాలంటూ.. సత్తెనపల్లి పట్టణ పోలీసులు బుధవారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డికి నోటీసులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెంటపాళ్ల పర్యటనకు సంబంధించి అక్రమ కేసులు నమోదు చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి నోటీసులు జారీ చేశారు. క్రైం నెంబర్ 156/2025 అండర్ సెక్షన్ 189(2), 189(3), 189(4), 298, 351 (2), 352, 126(2), 61(2) రెడ్‌విత్ 190 బీఎన్ఎస్ అండ్ సెక్షన్ 3ఆఫ్ పీడీపీపీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు అంశంలో జరిగిన నేరానికి సంబంధించి మీ పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా రూఢీ అయిన నేపథ్యంలో, దర్యాప్తులో భాగంగా సత్తెనపల్లి పట్టణ పోలీసుస్టేషన్‌కు హాజరుకావాలని నోటీసులో పోలీసులు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

- బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త సుశిక్షితుడైన సైనికుడిగా ముందుకు వెళ్లాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- ప్రత్తిపాడులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'
- 'రీ కాల్ చంద్రబాబుస్ మేనిఫెస్టో' పోస్టర్ల ఆవిష్కరణ

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, దాన్ని ప్రజల్లోనికి తీసుకువెళ్లేందుకు ప్రతి కార్యకర్త సుశిక్షితుడైన సైనికుడిగా పని చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు రూరల్ మండలం ఏటుకూరులోని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డిలు హాజరయ్యారు. రీకాల్ చంద్రబాబుస్ మేనిఫెస్టో (చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ) పోస్టర్లను ఆవిష్కరించారు.

చంద్రబాబు మోసం అందరికీ తెలిసింది

అంబటి రాంబాబు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అని చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు కుప్పలు తెప్పలుగా వాగ్దానాలు చేసి మేనిఫెస్టోలో పెట్టారని, వైఎస్ జగన్ కన్నా ఎక్కువ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తానని చెప్పడంతో ప్రజలు నమ్మి ఓట్లు వేశారన్నారు. కానీ అధికారంలోనికి వచ్చిన తరువాత సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం లేదన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనే విషయాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకు వెళ్లాలన్నారు.

ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లాలి..

ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్‌ను ప్రతి ఇక్కరికీ గుర్తు చేసేందుకే బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ మెట్టు వెంకటప్పారెడ్డి, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ మాజీ ప్రెసిడెంట్ పురుషోత్తం, జిల్లా అధికార ప్రతినిధి నాదెండ్ల రామచంద్రయ్య, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, యువజన విభాగం నాయకుడు నూనె ఉమామహేశ్వరరెడ్డి, ఆయా మండలాల మండల పార్టీ అధ్యక్షులు మన్నవ వీరనారాయణ, ఖాశింపీరా, చల్లా హనుమంతయాదవ్, ఆయా అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

రాష్ట్రంలో ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి, అరెస్టులు చేసి జైళ్లకు పంపుతున్నారన్నారు. మొన్న రైతులను పరామర్శించేందుకు గుంటూరు మిర్చియార్డుకు వచ్చిన సందర్భంలో, పొదిలిలో పొగాకు రైతులను పరామర్శించేందుకు వచ్చిన సమయంలో ఈ రోజు చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు న్యాయం చేయమని వెళుతున్న క్రమంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సృష్టిస్తున్న అవరోధాలు, అడ్డంకులు, నిర్బంధాలు చూస్తుంటే ఇందిరాగాంధీ కాలం నాటి ఎమర్జెన్సీ పాలన గుర్తుకువస్తుందన్నారు.

ప్రజలను మోసం చేసే ఏకైక వ్యక్తి చంద్రబాబు

మాజీ ఎంపీ, పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గెలిచాడని, కానీ ప్రజలు ఓడిపోయారన్నారు. గెలిపించిన ప్రజలనే మోసం చేసే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ప్రపంచంలోనే ఏకైక వ్యక్తి చంద్రబాబన్నారు. ఓడిపోయిన తరువాతనే మాజీ సీఎం వైఎస్ జగన్ విలువ జనానికి తెలుస్తుందన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అన్న విషయాన్ని ప్రజలు, మహిళల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అప్పుడు ఎంపీలు, ఎమ్మెల్యేలు ఊర్లల్లో తిరిగే ప్రసక్తి ఉండదన్నారు.

ప్రాచీన ఆలయంలో చోరీ



తెనాలిరూరల్: రూరల్ గ్రామం కొలకలూరులో అతి ప్రాచీన దేవాలయం శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం(శివాలయం)లో బుధవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. ఉదయం ఆలయంలో పూజల నిమిత్తం వచ్చిన భక్తులు ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఉండడం, హుండీ తాళాలు పగలగొట్టి ఉండటానికి గమనించి ఆలయ కార్యనిర్వహణాధికారికి సమాచారం ఇచ్చారు. ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీం ను పిలిపించి ఆధారాలు సేకరించారు. హుండీలో సుమారు రూ.20 వేలు అపహరణకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వాహణాధికారి నుంచి ఫిర్యాదు అందుకున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎంతో చరిత్ర కలిగిన పురాతన ఆలయంలో సీసీ కెమెరాలు లేకపోవడం గ్రామంలో చర్చనీయాంశమైంది.

నేటి నుంచి టౌన్‌చర్చి శతవార్షికోత్సవాలు



ఆవిష్కరణలో రెవ.ఏసురత్నం, లెనిన్‌బాబు, సాల్మన్‌రాజు, ఎంవీబీ ప్రకాష్‌బాబు

ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ప్యారిష్ పాస్టర్ రెవ.దేవరపల్లి ఏసురత్నం

తెనాలి: పట్టణంలో టౌన్‌చార్చిగా పిలుచుకునే ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చి (తూర్పు గుంటూరు సినడ్) క్రీస్తు దేవాలయం శతవార్షిక మహోత్సవాలు గురువారం నుంచి వైభవంగా ఆరంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రిక, బ్రోచర్‌ను బుధవారం టౌన్‌చర్చిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్యారిష్ పాస్టర్ రెవరెండ్ దేవరపల్లి ఏసురత్నం, అడిషనల్ పాస్టర్లు రెవరెండ్ వై.లెనిన్‌బాబు, రెవరెండ్ డి.సాల్మన్‌రాజు, రెవరెండ్ ఎంవీబీ ప్రకాష్‌బాబు అడ్‌హాక్ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. 10,11,12 తేదీల్లో ఉదయం ప్రార్థన, ఆరాధనలు, సాయంత్రం చర్చి వెలుపల వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. గౌరవ అతిథులుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఏఈఎల్ చర్చి కంట్రోలర్ జస్టిస్ కురియన్ జోసెఫ్, కేరళకు చెందిన మాజీ జడ్జి జోసెఫ్ పీఎస్, ఆంధ్రప్రదేశ్ మాజీ జూనియర్ జడ్జి ఎస్.జేసురత్నకుమార్‌లు హాజరవుతారని తెలిపారు.

- రెవ.వై.లెనిన్‌బాబు మాట్లాడుతూ మూడురోజుల ఉత్సవాలకు ప్రజలు హాజరై దేవుని మన్ననలు పొందాలని అడిషనల్ పాస్టర్లు రెవ.డి.సాల్మన్‌రాజు, రెవ.ఎంవీబీ ప్రకాష్‌బాబు కోరారు. శతవార్షిక మహోత్సవాల్లో భాగంగా 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి సెయింట్‌జాన్స్ విద్యాసంస్థ పక్కనగల లూథరన్ యూపీ స్కూలు ప్రాంగణంలో ప్రేమ విందు ఉంటుందని సభ్యుడు జి.వేమయ్య చెప్పారు.

ధూళిపాళ్లను టీడీపీలో ఎలా ఉంచుతారు?

ఎమ్మెల్యే ధూళిపాళ్ల ప్రేరేపణతోనే పాశవిక దాడి

- దళితుడైన నాగమల్లేశ్వరరావుపై దాడిని ఖండించేవారే టీడీపీలో లేరా?
- ఏ-4, ఏ-5 నిందితులు టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించడమా?
- టీడీపీ అధినాయకత్వం సూచనల మేరకే వైఎస్సార్, వైఎస్ జగన్‌ను అభిమానించే వారిపై పథకం ప్రకారం దాడులు
- మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రోద్బలంతోనే మన్నవ సర్పంచి నాగమల్లేశ్వరరావుపై భీకరమైన దాడికి ఒడిగట్టారని, ఇంతటి క్రూర మనస్తత్వం కలిగిన వారిని టీడీపీలో ఎలా ఉంచుతారని వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు పెచ్చరిల్లాయన్నారు. పొన్నూరు మండలం మన్నవ సర్పంచి నాగమల్లేశ్వరరావుపై మరణాయుధాలతో క్రూరంగా హత్యాయత్నం జరిగితే, అయ్యో పాపం అనే వారు టీడీపీలో లేరా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో దళితులు ఓట్లేయలేదని, టీడీపీకి వ్యతిరేకంగా పని చేశారనే దుగ్ధతో పాశవిక దాడులతోపాటు మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



రాంబాబు చిత్రపటాన్ని చూపుతున్న జూపూడి, పక్కన అంబటి మురళీకృష్ణ

నరేంద్రది ఫ్యూడల్ మనస్తత్వం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభిమానించే వారిపై ప్రత్యక్ష దాడులకు పాల్పడాలని టీడీపీ అధినాయకత్వం నుంచి సందేశాలు వస్తున్నాయని, అందులో భాగంగానే నాగమల్లేశ్వరరావుపై పాశవికంగా హత్యాయత్నానికి తెగ బడ్డారన్నారు. కిందపడిపోయిన నాగమల్లేశ్వరరావు మెడ, తలపై మరణాయుధాలతో అత్యంత కర్కశకంగా హత్యాయత్నం చేశారని వాపోయారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు నిందితుడు బాబు రావు కుటుంబం ముఖ్యమైనదన్నారు. నరేంద్రకు ఫ్యూడల్ మనస్తత్వం ఉందన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌లో ఒక డైరక్టర్ పదవికి బాబు రావు ఆశపడ్డాడని విమర్శించారు. ఎమ్మెల్యే నరేంద్ర పరోక్షంగా ప్రేరేపించాడనే బాబురావు పాశవిక దాడులకు దిగడం సరికాదన్నారు. ఏ-4గా బాబురావు, ఏ-5గా ఉన్న చింపిరయ్యలు టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం విడ్డూరన్నారు. సమావేశం నిర్వహించే ధైర్యం వారికి ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు.

ప్రజల రక్షణ బాధ్యత అధికారులదే..

ఎన్నికల సమయంలో రాంబాబు అనే వ్యక్తి ఎమ్మెల్యే నరేంద్రకుమార్ కారు కింద నలిగి మృతి చెందాడని గుర్తు చేస్తూ, మృతుడు రాంబాబు చిత్రపటాన్ని జూపూడి విలేకరులకు చూపించారు. ఎమ్మెల్యే నరేంద్రకు చెందిన డీవీసీ ఆసుపత్రిలో బాధితుడు చనిపోతే రూ.10 లక్షలు పరిహారం ఇచ్చి కేసు నమోదు కాకుండా చేసుకున్నారని ఆరోపించారు. ఇంత వరకు ఈ కేసును బయటకు రానివ్వలేదని మండిపడ్డారు. గుంటూరులో పోలీసులు హోల్‌సేల్‌గా అమ్ముడుపోయారా అని విమర్శించారు. ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు భజనలు చేసేందుకు కాదన్నారు. దళితులపై ఏకపక్షంగా దాడులు జరుగుతుంటే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. సమావేశంలో పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తాడికొండ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిషోర్, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు దాసరి రాజు, నీలాంబరం, స్టాలిన్, గనిక ఝాన్సీ, సునీత పాల్గొన్నారు.

సమన్వయంతో సైబర్ నేరాలకు చెక్



నగరంపాలెం: పోలీస్ శాఖ, బ్యాంక్‌లు సమన్వయంతో సైబర్ నేరాలను అరికడదామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో బుధవారం జిల్లాలోని బ్యాంక్‌ల మేనేజర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న దృష్ట్యా సైబర్ మోసాలు గణనీయంగా పెరిగాయన్నారు. ఈ క్రమంలో జిల్లాలోని ప్రజలు, ఖాతాదారులకు ముందస్తు సమాచారం, అవగాహన కల్పిద్దామన్నారు. వినియోగదారులు పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే బాధితులకు ఎఫ్ఐఆర్ లేకుండా సహాయమందుతుందన్నారు. ఖాతాదారులు ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి నగదు లావాదేవీలు నిర్వర్తించే వేళల్లో బ్యాంక్‌లను సంప్రదించి నిజనిజాలను పరిశీలించాలని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలు, లోన్ యాప్ మోసాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఖాతాదారులకు, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైం), యూనియన్ బ్యాంక్ డీజీఎం జవహర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, బ్యాంక్‌ల మేనేజర్లు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా రెడ్‌క్రాస్‌కు పతకాలు



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వడ్లమాని రవి, రామచంద్రరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక సేవా విభాగంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గుంటూరు జిల్లా రెడ్‌క్రాస్‌కు గవర్నర్ పురస్కారాలు లభించాయి. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన రెడ్‌క్రాస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో భాగంగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ గుంటూరు జిల్లా చైర్మన్ డాక్టర్ వడ్లమాని రవి, వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు అవార్డులను అందుకున్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి, 2023–24 ఆర్థిక సంవత్సరానికి తృతీయ ఉత్తమ జిల్లాగా గుంటూరు రెడ్‌క్రాస్‌కు అవార్డులు వరించాయి.

వైకుంఠపుర వాసుని ఆదాయం రూ.46.76 లక్షలు



తెనాలిరూరల్: స్థానిక వైకుంఠపురంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ టి.సుభద్ర, దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.అనుపమ నేతృత్వంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ హుండీల లెక్కింపు జరిగింది. 113 రోజుల అనంతరం లెక్కింపు జరిపారు. పట్టణానికి చెందిన పలువురు భక్తులు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు, మహిళలు స్వచ్ఛందంగా లెక్కింపు సేవలో పాల్గొన్నారు. దేవస్థానంలోని హుండీ లెక్కింపు ద్వారా రూ.46,76,204 నగదు స్వామి వారికి సమకూరింది. అలానే 19.50 గ్రాముల బంగారం, 319 గ్రాముల వెండిని భక్తులు స్వామి వారికి సమర్పించారు. అలానే రద్దయిన పాత రూ. వెయ్యి నోట్లు ఆరు, రూ. 500 నోట్లు పది గుర్తు తెలియని భక్తులు హుండీలో వేశారు. లెక్కింపులో భక్తులు, వలంటీర్లు, చెంచుపేట ఆప్కాబ్ బ్యాంక్ సిబ్బంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.